షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152
1st Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
సంపుటి : 3 సంచిక : 126
బుధవారం 13 మే 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## మద్యం దుకాణాలపై.. విజయ్ సంచలన నిర్ణయం



(షణ్ముఖ వెలుగు, తమిళనాడు,మే 12)


తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రార్థనా మందిరాలు, పాఠశాలల వద్ద మద్యం దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. విజయ్ నిర్ణయంతో 717 మద్యం దుకాణాలు మూతపడనున్నాయి.

ఈ మేరకు మంగళవారం తమితమిళనాడుళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం దేవాలయాలు, మసీదులు, చర్చిలు, పాఠశాలలు, కళాశాలలతో పాటు బస్టాండ్‌లకు 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం దుకాణాలు ఉండకూడదని పేర్కొంది. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టాస్మాక్) ఆధ్వర్యంలో నడుస్తున్న వాటన్నింటినీ రెండు వారాల్లోగా మూసివేయాలని ఆదేశించింది. సామాన్య ప్రజల శ్రేయస్సును దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కాగా.. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 4,765 మద్యం రిటైల్ దుకాణాలు టాస్మాక్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. తాజాగా మూసివేయడానికి గుర్తించిన 717 దుకాణాల్లో.. 276 ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యాసంస్థలు, మరో 255 బస్‌స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. సీఎం విజయ్ తాజా ఆదేశాలతో మరికొన్ని రోజుల్లో ఇవి మూతపడనున్నాయి.

**సరైన నిర్ణయం: కమల్ హాసన్**

మద్యం దుకాణాలపై సీఎం విజయ్ తీసుకున్న నిర్ణయంపై అగ్ర కథానాయకుడు కమల్‌హాసన్ ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రార్థనా స్థలాలు, విద్యాసంస్థల సమీపంలో మద్యం దుకాణాలను తొలగించాలని తమిళ ప్రజలు ▶మిగతా 2లో

## రైతులు పీఆర్ 126, 1010 రకాలు సాగు చేయొద్దు: మంత్రి నాదెండ్ల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 12)

రైతులు వచ్చే సీజన్‌లో వరిలో పీఆర్ 126, 1010 రకాలను సాగు చేయొద్దని రైతులకు ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. సాధారణంగా నూకల శాతం 25 శాతం లోపు ఉండాలని.. ఈ 2 రకాల్లో 56 శాతానికి మించి వస్తున్నట్లు తేలిందన్నారు. దీంతో కొనుగోలులో రైతులు, మిల్లర్లకు ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ▶మిగతా 2లో

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు త్వరలోనే జీఏడీకి అప్పగిస్తాం: మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 12)

నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలను త్వరలోనే జీఏడీకి అప్పగిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అధికారుల భవనాలు, మంత్రుల బంగ్లాల నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని చెప్పారు. రాజధాని అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లను మంత్రి నారాయణ మంగళవారం పరిశీలించారు. నివాస సముదాయాల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఇంటీరియర్‌తో పాటు మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలను మంత్రి నారాయణ ఆదేశించారు.గ్రూప్-1, గ్రూప్-2 అధికారుల టవర్ల నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయని చెప్పారు. అమరావతిలో ▶మిగతా 2లో

# మే 15న పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా?

**పుట్టపర్తిలో రూ.లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ**

**మే 15న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**ఈ ప్రాజెక్టుతో 20 వేల మందికి ఉపాధి అవకాశాలు**

**పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా అంటూ లోకేష్ ట్వీట్**

**ఆధునిక యుద్ధ విమానం ఏఐ వీడియోను పంచుకున్న నారా లోకేష్**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 12)

ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. “మే 15న పుట్టపర్తి నుంచి ఏం టేకాఫ్ అవుతుందో ఊహించగలరా?” అంటూ ఆయన మంగళవారం ట్వీట్ చేశారు. దీనికి జతగా, ఓ అత్యాధునిక స్టెల్త్ యుద్ధ విమానం ఆకాశంలోకి దూసుకెళ్తున్న ఏఐ (ఏఐ) వీడియోను కూడా పంచుకున్నారు. ఈ పోస్ట్ ద్వారా పుట్టపర్తిలో రాబోతున్న భారీ ప్రాజెక్టుపై ఆయన అంచనాలను పెంచారు.శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రాంతంలో సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటు కానున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం ఈ నెల 15వ తేదీన జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు.ఈ మెగా ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా. రాష్ట్రంలో రక్షణ రంగ ఉత్పాదనను ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. శంకుస్థాపన కార్యక్రమం సమీపిస్తున్న తరుణంలో, మంత్రి నారా లోకేష్ చేసిన ఈ టీజర్ ట్వీట్ ప్రాజెక్టుపై సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది. ▶మిగతా 2లో

## 2027 జూన్‌లో పోలవరం జాతికి అంకితం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 12)

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం 2027 జూన్ నాటికి పూర్తి చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఐదేళ్ల జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకమైపోయిందన్నారు. అది ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని గత పాలకులు చేతులెత్తేసిన దుస్థితి నుంచి వచ్చే ఏడాది పూర్తి చేస్తామని సగర్వంగా ప్రకటించే స్థాయికి తీసుకొచ్చామని గుర్తుచేశారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో ▶2లో

## ప్రపంచస్థాయి ‘మైస్’ గమ్యస్థానంగా ఏపీ



**సన్‌టెక్ సిటీ గురించి మంత్రి లోకేశ్‌కు వివరిస్తున్న ఆ సంస్థ ప్రతినిధులు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 12)

అంతర్జాతీయ ఈవెంట్ నిర్వాహకులకు సింగిల్ విండో విధానంలో అనుమతులను వేగవంతం చేయడానికి విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలో ప్రత్యేక బ్యూరోలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సింగపూర్ పర్యటనలో భాగంగా సన్‌టెక్ సిటీని సందర్శించిన లోకేశ్.. డీపీ అర్బన్ ఆర్కిటెక్ట్ సంస్థ డైరెక్టర్ ఆనందన్ కరుణాకరన్‌తో భేటీ అయ్యారు. లోకేశ్ మాట్లాడుతూ ‘ప్రపంచస్థాయి మైస్ (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్, ఎగ్జిబిషన్స్) ఈవెంట్లకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం. ఇందుకోసం మేం కొత్తగా మైస్ విధానాన్ని రూపొందిస్తున్నాం. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని హోటళ్లలో గదుల సంఖ్య 4 రెట్లు పెరిగి.. 20 వేలకు చేరుకుంటుంది. ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ఆతిథ్య సంస్థలు అమరావతికి వస్తున్నాయి. మైస్ పరిశ్రమను ప్రోత్సహించడానికి అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విశాఖలో ప్రపంచస్థాయి మైస్ కేంద్రాన్ని నిర్మించబోతున్నాం. భారత ప్రభుత్వ ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో విశాఖలో ఆంధ్ర మండపాల్ని ఏపీ ఇప్పటికే ప్రకటించింది. విశాఖ తీరప్రాంతంలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ గ్లోబల్ టెక్ కంపెనీలు ▶మిగతా 2లో



## అసోం సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరైన చంద్రబాబు, లోకేష్... ఫొటో రౌండప్!

అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారానికి హాజరైన చంద్రబాబు, లోకేష్

ఈ కార్యక్రమానికి పలువురు ఎన్డీఏ నేతలు హాజరు

కూటమి పాలిత రాష్ట్రాల సీఎంలతో చంద్రబాబు, లోకేష్ సంభాషణ ▶ 2లో

## చమురు సంక్షోభం భారత్‌లోనే కాదు అంతటా పొదుపు మంత్రమే

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 12)



ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న చమురు సంక్షోభం వేళ పౌరులకు ప్రధాని మోదీ కీలక విజ్ఞప్తి చేశారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ [illegible] వినియోగించాలని; వర్క్‌ఫ్రమ్, ఆన్‌లైన్ సమావేశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనవసర ప్రయాణాలను తగ్గించుకోవాలని సూచించారు. దీంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. మళ్లీ లాక్‌డౌన్ పరిస్థితులు రాబోతున్నాయా? అంటూ ఊహాగానాలూ మొదలయ్యాయి. వాస్తవానికి ఇప్పటికే పలు దేశాలు ఈ పొదుపు మంత్రాన్ని పాటిస్తున్నాయి.

ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ ప్రకారం.. పశ్చిమాసియా ఘర్షణల తర్వాత 40 దేశాలు, యూరోపియన్ కమిషన్ ఇంధన పొదుపు చర్యలను ప్రారంభించాయి. హర్మూజ్ మూసివేత వల్ల ఏర్పడిన ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు పలు చర్యలు చేపట్టాయి. వర్క్‌ఫ్రమ్ హోమ్/ఫ్లెక్సిబుల్ వర్క్ ఫ్రమ్ హోమ్, ఏసీ టెంపరేచర్ విషయంలో పరిమితులు, ప్రయాణాలపై ఆంక్షలు, ఫ్యూయల్ రేషనింగ్ విధానాలను ఆయా దేశాలు అమలు చేస్తున్నాయి. కొన్ని దేశాలు పొదుపు పాటించాలని సూచిస్తుండగా.. మరికొన్ని దేశాలు మాత్రం కఠినంగా అమలు చేస్తున్నాయి. 13 దేశాల్లో వర్క్‌ఫ్రమ్ హోమ్ అమలవుతుండగా.. 18 దేశాలు వివిధ రూపాల్లో వాహన వినియోగంపై ఆంక్షలు చేపడుతుండడం గమనార్హం.

**ఏ దేశం ఎలా అంటే?**

వర్క్‌ఫ్రమ్ హోమ్: పాకిస్థాన్‌లో 4 రోజుల పనిం 50 శాతం రిమోట్ వర్క్ విధానం అమల్లో ఉంది. ఇండోనేసియాలో శుక్రవారాల్లో వర్క్‌ఫ్రమ్ హోమ్ ఇస్తుండగా.. శ్రీలంకలో బుధవారాలు కార్యాలయాలకు సెలవు ప్రకటించారు.

ఏసీ కూలింగ్‌పై పరిమితులు: విద్యుత్‌ను ఆదా చేసేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాల్లో ఏసీ కూలింగ్‌పై ▶మిగతా 2లో

## ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా సాయం.. మాకు ముందే తెలుసు: భారత్




**పాకిస్థాన్‌కు క్షేత్రస్థాయిలో సాంకేతిక సాయం అందించినట్లు చైనా అంగీకారం**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 12)

గత సంవత్సరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా సాంకేతిక సాయం అందించిందన్న వార్తలపై భారత్ స్పందించింది. గతంలో తమకు తెలిసిన విషయాలనే ఈ నివేదికలు ధృవీకరిస్తున్నాయని పేర్కొంది. ఈ విషయంలో బీజింగ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించింది.పాకిస్థాన్‌కు చైనా సహకరించిందనే కథనాలను ▶ 2లో

## ‘సిందూర్’ వేళ పాక్‌కు చైనా మద్దతు వార్తలు..స్పందించిన భారత్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 12)

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా సాయం అందించినట్లు వస్తున్న వార్తలపై కేంద్ర విదేశాంగ శాఖ స్పందించింది. ఈ విషయం తమకు ముందే తెలుసునని.. దాన్ని ధ్రువీకరించే కథనాలను తాము చూశామని పేర్కొంది.బాధ్యతాయుతంగా ఉన్నామని ప్రకటించుకునే కొన్ని దేశాలు ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న దేశాలకు మద్దతు ఇవ్వడం తగదని పరోక్షంగా చైనాను ఉద్దేశిస్తూ హితవు పలికింది.



‘పహల్గాంలోని ఉగ్ర దాడులకు ఆపరేషన్ సిందూర్ ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందన. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు భారత్‌లో దాడులకు పాల్పడుతున్నారు. వారిని పూర్తిగా నిర్మూలించాలంటే అక్కడి మౌలిక సదుపాయాలను ▶ 2లో





# గుల్మార్గ్‌లో గృహ, పట్టణ పథకాల పై చర్చలు జరిపిన కమిటీ చైర్మన్ మాగుంట





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)

అధ్యయన సందర్శన కార్యక్రమంలో భాగంగా గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటు కమిటీ చైర్మన్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం గుల్మార్గ్ పట్టణంలో కమిటీ సభ్యులతో కలసి గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలకు సంబందించిన పలు కేంద్ర పథకాల అమలు పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జమ్మూ, కాశ్మీర్ పరిపాలన శాఖ, గృహ పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, గుల్మార్గ్ అభివృద్ధి సంస్థ, బారాముల్లా మునిసిపల్ కౌన్సిల్, శ్రీనగర్ మునిసిపల్ కార్పొరేషన్, ఆర్థిక మంత్రిత్వ శాఖ, హడ్కో, యన్.బి.సి.సి, సి.పి.డబ్ల్యు.డి, స్టేట్ బ్యాంకు, జమ్మూ కాశ్మీర్ బ్యాంకు తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అమృత్, అమృత్ 2, స్వచ భారత్ మిషన్, 2.0, పి.యం.ఎస్.వి.ఏ.నిధి, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, నుడమ్, పియం ఈ బస్ సేవ పథకాల పనితీరు, హడ్కో యన్.బి.సి.సి, సి.పి.డబ్ల్యు.డి, పనితీరు, బారాముల్లా, శ్రీనగర్ మునిసిపల్ కార్పోరేషన్ల ఆదాయ పెంపు, బడ్జెట్ నిర్వహణ పై ప్రతినిధులతో కమిటీ సభ్యులు చర్చలు జరిపారు. ఈ చర్చలలో ప్రతినిధులు కోరిన సదుపాయాలు, చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని వారికి మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు.

# రీసర్వేతో సమస్యలు పరిష్కారం



(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, మే 12)

జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి మంగళవారం టంగుటూరు మండలంలో పర్యటించారు. ముందుగా 5వ విడత రీసర్వే జరుగుతున్న వల్లూరు గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ గ్రామంలో గ్రౌండ్ ట్రూతింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. నిబంధనల ప్రకారం ముందుగా నోటీసులు ఇచ్చి రైతుల సమక్షంలోనే ఈ-కేవైసీ చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆ విధంగానే అధికారులు చేస్తున్నట్లు స్థానిక రైతులు జాయింట్ కలెక్టరుకు తెలిపారు. రీసర్వే ద్వారా రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు ఈ సందర్భంగా ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం టంగుటూరు తహసీల్దారు కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించారు. రీసర్వేకు సంబంధించిన డేటాను విలేజ్ సర్వేయర్ లాగిన్‌లో ఏ విధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఐసిడిఎస్ అధికారులు ఏర్పాటు చేసిన 'కిషోరి వికాసం' కార్యక్రమంలో కూడా జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. కిషోర ప్రాయంలోని బాలికల అభివృద్ధి, ఆరోగ్యం, సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పర్యటనలో ఆమె వెంట జిల్లా సర్వే అధికారి గౌస్ బాషా, ఎంపీడీవో దేవసేన కుమారి, తహసిల్దార్ ఆంజనేయులు, ఇతర అధికారులు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

## మద్యం దుకాణాలపై.. విజయ్ సంచలన నిర్ణయం

ఎప్పటినుంచో కోరుకుంటున్నారన్నారు. సోదరుడు విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. మద్యం అమ్మకాలు ప్రభుత్వ విధిగా ఉండకూడదని, వాటిని నియంత్రించే బాధ్యతను మాత్రమే తీసుకోవాలన్నారు. తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం 717 దుకాణాలతో ఆగిపోకూడదన్నారు. ఈ చర్యను నిరంతరాయంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు.

## రైతులు పీఆర్ 126, 1010 రకాలు సాగు చేయొద్దు: మంత్రి నాదెండ్ల

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వైకాపా హయాంలో వ్యవస్థల నిర్వీర్యంతో సాగుదారులు పడిన కష్టాలను గుర్తించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోందని గణాంకాలతో సహా వివరించారు. వైకాపా ప్రభుత్వంతో పోలిస్తే ఈసారి 57 శాతం అదనంగా, గత ఏడాదితో పోలిస్తే 18 శాతం అదనంగా ధాన్యం సేకరించామన్నారు. ఇప్పటివరకు 19.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మంత్రి తెలిపారు. ఖరీఫ్‌లో 48,700 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.11,550 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి వివరించారు.

పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూస్తున్నాం

రాష్ట్రంలో ఇంధన సరఫరాపై ప్రభుత్వం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. ఎల్పీజీ గ్యాస్ డెలివరీ సమయాన్ని వారానికి కాకుండా నాలుగు రోజులకు తగ్గించాలని చమురు కంపెనీలను ఆదేశించామన్నారు. రోజుకు 1.83 లక్షల డెలివరీలు జరుగుతున్నాయన్నారు. వాణిజ్య సిలిండర్ల ధర పెరిగినందున వీటిని మళ్లించేందుకు ప్రయత్నించిన ఏడు ఏజెన్సీలపై చర్యలు తీసుకున్నామని.. నిఘాను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా పెట్రోల్, డీజిల్ కొరత ఉండకుండా చూస్తున్నామన్నారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు త్వరలోనే జీఏడీకి అప్పగిస్తాం: మంత్రి నారాయణ

జరుగుతున్న నిర్మాణ పనులపై పక్క రాష్ట్రాల్లో కూడా చర్చించుకుంటున్నారన్నారు. 34,525 ఎకరాలకు సంబంధించి ప్లాట్లు రైతులకు ఇచ్చామని, 674 మంది రైతులకు మాత్రమే న్యాయపరమైన చిక్కుల వల్ల ప్లాట్ల పంపిణీ ఆగిపోయిందన్నారు. కావాలని కొందరు అమరావతిపై రాజకీయ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. భూములు ఇచ్చాం.. ప్రభుత్వం ప్లాట్లు ఇవ్వలేదని ప్రచారం చేసే వాళ్లు నిజాలు తెలుసుకోవాలని మంత్రి హితవు పలికారు.

## ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు చైనా సాయం.. మాకు ముందే తెలుసు: భారత్

తాము చూశామని, కానీ ఈ విషయం తమకు ముందే తెలుసని విదేశాంగ శాఖ తెలిపింది. బాధ్యతాయుతంగా ఉన్నామని ప్రకటించుకునే కొన్ని దేశాలు ఉగ్రవాదులకు అండగా నిలుస్తున్న దేశాలకు మద్దతు పలకడం తగదని హితవు పలికింది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా చేపట్టిందని తెలిపింది.పాకిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని తెలిపింది. మన సైన్యం అదే పని చేసిందని తెలిపింది. అలాంటి ఉగ్ర స్థావరాలను రక్షించేందుకు సాయం చేయడం సరైనదో కాదో ఆయా దేశాలే ఆలోచించుకోవాలని కోరింది.

కాగా, గత సంవత్సరం భారత్‌తో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్‌కు క్షేత్రస్థాయిలో సాంకేతిక సాయం అందించినట్లు చైనా అంగీకరించింది. ఏవియేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఆఫ్ చైనాకు చెందిన ఒక ఇంజినీర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు ఆ దేశ అధికార మీడియా సీసీటీవీ ఓ కథనం ప్రసారం చేసింది.

## 2027 జూన్‌లో పోలవరం జాతికి అంకితం

కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్‌పాటిల్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'పోలవరం సత్వర పూర్తికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని, నిర్వాసితుల పునరావాసం, పరిహారాలకు సంబంధించి నిధులను సకాలంలో సమకూరుస్తామని జలశక్తి మంత్రి పాటిల్ హామీ ఇచ్చారు.రెండో దశలో కీలకమైన భూసేకరణ, పునరావాసం కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరాం. ఏటా గోదావరి నుంచి సముద్రంలో కలిసిపోయే 3వేల టీఎంసీల జలాల్లో కొంత ఉపయోగించుకొని రాష్ట్రాన్ని కరవురహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం- నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని అడిగాం. తెలంగాణతో ఏమైనా చిన్నపాటి సమస్యలు ఉంటే చర్చల ద్వారా సానుకూల వాతావరణంలో సర్దుబాటు చేసుకుంటామని చెప్పాం. చిన్న నీటిపారుదల రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకొని నిధులు ఇవ్వాలని కోరాం. కాలువలకు బదులు పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరాకు ఎంపికైన విజయనగరం జిల్లాలో పనులు ముందుకు తీసుకువెళుతున్నట్టు ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి చెప్పారు' అని రామానాయుడు వెల్లడించారు.

## చమురు సంక్షోభం భారత్‌లోనే కాదు అంతటా పొదుపు మంత్రమే

పరిమితులు విధించారు. బంగ్లాదేశ్, సింగపూర్‌లో 25లీ డిగ్రీల కనీస ఉష్ణోగ్రతను పాటించాలని అక్కడి ప్రభుత్వాలు కోరుతున్నాయి. మలేసియా (24 డిగ్రీలు), శ్రీలంక (26 డిగ్రీలు), థాయ్‌లాండ్ (26డిగ్రీలు) వంటి దేశాల్లోనూ ఇదే పరిస్థితి. జోర్డాన్‌లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీ వినియోగంపై నిషేధం ఉంది.

ప్రయాణ ఆంక్షలు: అనేక దేశాలు ప్రభుత్వ అధికారుల విదేశీ ప్రయాణాలపై తాత్కాలిక నిషేధం విధించాయి. జోర్డాన్, పాకిస్థాన్‌లో విదేశీ ప్రయాణాలపై నిషేధం అమల్లో ఉంది. కొరియాలో ప్రభుత్వ వాహనాలకు సరి-బేసి విధానం అమలవుతోంది.

విద్యాసంస్థలు: శ్రీలంకలో బుధవారాలు సెలవు ప్రకటించగా.. పాకిస్థాన్‌లో పూర్తిగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో యూనివర్సిటీలు మూసివేశారు. మరికొన్ని దేశాలు వారానికి కొన్ని రోజులు మాత్రమే ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తూ, మిగిలిన రోజుల్లో ఆన్‌లైన్ తరగతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

రవాణా, ఇంధన పొదుపు: శ్రీలంక వంటి దేశాల్లో ~= కోడ్ ఆధారిత రేషనింగ్ అమల్లో ఉంది. బంగ్లాదేశ్‌లో చమురుపై పరిమితులు ఉన్నాయి. కొరియా, మయన్మార్ వంటి దేశాల్లో వాహనాల వినియోగాన్ని తగ్గించడానికి సరి-బేసి విధానాన్ని అమలు చేస్తున్నారు. పాకిస్థాన్‌లో ఉచిత ప్రజారవాణా అమలు చేస్తున్నారు. వాహన వేగంపైనా ఆంక్షలు పెట్టారు. వాణిజ్య కేంద్రాలను సాయంత్రం 8 గంటలకు మూసివేయాలని పాక్ ప్రభుత్వం ఆదేశించింది. దీంతోపాటు పలు దేశాలు విద్యుత్ వాడకం తగ్గించాలని పౌరులకు విజ్ఞప్తి చేశాయి.

## ప్రపంచస్థాయి 'మైస్' గమ్యస్థానంగా ఏపీ

ఏర్పాటవుతున్నాయి' అని వివరించారు. సింగపూర్ డౌన్ టౌన్ వ్యాపార కేంద్రానికి నడిబొడ్డున సన్‌టెక్ సిటీని తమ సంస్థ డిజైన్ చేసిందని, ఇది 42 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అధునాతన సాంకేతికతతో నిర్మించిన ఈవెంట్ ప్లేస్ అని కరుణాకరన్ మంత్రి లోకేశ్‌కు వివరించారు. సింగపూర్‌ను సురక్షిత, విశ్వసనీయ అగ్రశ్రేణి గమ్యస్థానంగా నిలబెట్టడానికి సింగపూర్ టూరిజం బోర్డు విస్తృత ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు.

## అసోం సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరైన చంద్రబాబు, లోకేష్... ఫొటో రౌండప్!

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 12)

కేంద్ర మంత్రులతోనూ సరదాగా ముచ్చటించిన నేతలు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అసోంలో పర్యటించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వారిద్దరూ హాజరయ్యారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశంలోని పలువురు ఎన్డీఏ నేతలు తరలివచ్చారు.

ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో చంద్రబాబు, లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులతో వారు సరదాగా ముచ్చటించారు. ఈ కార్యక్రమం ఎన్డీఏ కూటమి నేతల మధ్య స్నేహపూర్వక భేటీకి వేదికగా మారింది.వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ముఖ్య నేతలతో చంద్రబాబు, లోకేష్ ఆత్మీయంగా సంభాషిస్తూ కనిపించారు. ఈ పర్యటన ద్వారా జాతీయ స్థాయిలో కూటమి నేతలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నట్లయింది.

## 'సిందూర్' వేళ పాక్‌కు చైనా మద్దతు వార్తలు..స్పందించిన భారత్

నిర్మూలించడమే ఏకైక మార్గం. దేశ సైనికులు అదే పని చేశారు. అటువంటి ఉగ్ర స్థావరాలను రక్షించేందుకు సాయం చేయడం సరైనదో కాదో ఆయా దేశాలే ఆలోచించుకోవాలి' అని విదేశాంగ శాఖ పేర్కొంది.

చైనా ఏమందంటే?గత సంవత్సరం భారత్‌తో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్‌కు క్షేత్రస్థాయి సాంకేతిక సాయం అందించినట్టు చైనా అంగీకరించింది. ఏవియేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఆఫ్ చైనా (ఏవీఐసీ)కు చెందిన ఓ ఇంజినీర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు అక్కడి అధికారిక మీడియా సీసీటీవీ ఓ కథనం ప్రసారం చేసింది. భారత్ దాడుల సమయంలో తమ సపోర్టు బృందం పాక్‌తో కలిసి పనిచేసిందని చైనా ఇంజినీర్ పేర్కొన్నారు.

# 13 మంది వాహనదారులకు జరిమానా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)


ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఉత్తర్వుల మేరకు విజుబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 14 మందిని సోమవారం కోర్టు వారి వద్ద హాజరు పరిచారు. 13 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.1,30,000 జరిమానా, ఒక్కరికి 2 రోజులు జైలు శిక్ష విధించారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ హజరత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ ఎంవీ యాక్ట్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని తెలిపారు.

# పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలి

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 12)



మండలంలోని మాలపాడు గ్రామపంచాయతీలో మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో కిషోర్ వికాసం భాగంగా నా అవసరాలు మన సవాళ్లు పై అవగాహన కల్పించారు. జిల్లా ప్రత్యేక అధికారి రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి బిడ్డకు సరైన పోషకాహారం, నాణ్యమైన విద్య అందటం వారి ప్రాథమిక హక్కుని తెలిపారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తూ వారికి ఎదురయ్యే సమస్యలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలు, వీఆర్వో విజయ్ మహేష్, ఉష, రాధ, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

13.05.26 బుధవారం


## సంతమాగులూరులో ‘ మీకోసం ’

**15న అద్దంకి నియోజకవర్గస్థాయిలో నిర్వహణకు అధికారుల చర్యలు**

**వినియోగించుకోవాలని ప్రజలకు కలెక్టర్ పిలుపు**

**అదే రోజు సజ్జాపురంలో పల్లెనిద్ర**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 12)**
అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండలంలో ఈనెల 15వ తేదీన ‘ మీకోసం ’ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలలో ప్రతి శుక్రవారం ఒకే నియోజకవర్గంలో ‘ మీకోసం ’ కార్యక్రమం నిర్వహించాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో తొలుత అద్దంకి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు (తరువాయి 4లో...)

# శ్రీ హరి హర క్షేత్రంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

**230 కలశాల తో స్వామి వారి అభిషేకం**

**వైభవంగా నగరోత్సవం**

**విశేష పూజలు, అభిషేకం, హోమాలు నిర్వహించిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు, శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా సుధీర్ కుమార్**







**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, మే 12)**
హనుమజ్జయంతి సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు, శిద్దా సుధాకర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు, ఉభయ దాతలు, భక్తులు రుత్వికుల ఆద్వర్యంలో మంగళవారం ఉదయం శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ట, లక్ష్మి గణపతి హోమం, మూలబింబ మంత్ర హోమాలు, మన్య సూక్త హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమం, మహా పూర్ణహుతి నిర్వహించారు. తదుపరి శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి 230 కలశములతో, పంచామృత ఫలరస, సుగంధ ద్రవ్యములతో స్వామి వారికి అభిషేకం, అనంతరం స్వామి వారి విశేష అలంకరణ, లక్ష నాగవల్లీ దళార్చన, మహా నైవేద్యం, మహా మంగళ హారతి, మహా మంత్ర పుష్పము, క్షమా ప్రార్థన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ భజన నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామి వారికి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు భక్తులతో కలసి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ శిద్దా వెంకట సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు ట్రస్ట్ అధ్వర్యంలో భక్తులకు, అన్న ప్రసాదాలు అందచేసారు. (తరువాయి 4లో...)

# ట్రాన్స్ జెండర్ సంక్షేమ బోర్డు సభ్యులుగా బోను దుర్గ నియామకం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)**
ట్రాన్స్ జెండర్ సంక్షేమ బోర్డు రాష్ట్ర సభ్యులుగా ఒంగోలుకు చెందిన బోను దుర్గా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి మంగళవారం ఉత్తర్వులు అందుకున్నారు. ట్రాన్స్ జెండర్ వెల్ఫేర్ బోర్డు ప్రాంతీయ ప్రతినిధులుగా విశాఖ, తిరుపతి కలెక్టర్లు, తూ.గో నుంచి కోటా ప్రేమ్ సాగర్ రాయ్, గుంటూరు జిల్లా నుంచి నక్క జీవన్ కుమారి, ప్రకాశం జిల్లా నుంచి బోను దుర్గ ఎంపిక అయ్యారు. పదవి వచ్చేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావుకి బోను దుర్గ కృతజ్ఞతలు తెలియజేశారు. (తరువాయి 4లో...)

# ఉపాధి హామీ పనుల్లో ఎన్ఎంఎంఎస్ హాజరు పై అనుమానాలు

**తప్పుడు ఫోటోలు అప్లోడ్ చేస్తున్నారంటూ**

**మేట్ పై గ్రామస్తుల ఆరోపణలు**




**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మే 12)**
మార్కాపురం జిల్లా పుల్లలచెరువు మండలం పుల్లలచెరువు గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో కొంతమంది కూలీలకు మేటుగా వ్యవహరిస్తున్న ఖాసీంవలి అనే వ్యక్తి పనికి రాని వారి ఫోటోలను ఎన్ఎమ్ఎమ్ఎస్ యాప్‌లో అప్లోడ్ చేస్తున్నాడని గ్రామంలో చర్చ జరుగుతోంది. సోమ, మంగళవారం రోజులలో అప్లోడ్ చేసిన ఫోటోలను పరిశీలిస్తే, తన వద్దనున్న లాగిన్‌ను దుర్వినియోగం చేస్తున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పని గుర్తింపు సంఖ్య 100503 వద్ద పనికి వచ్చిన వారి కంటే ఎక్కువ మంది ఫోటోలు అప్లోడ్ చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. జాబ్ కార్డు నెంబర్ 10724కు చెందిన జంగం వీరమ్మ, మస్టర్ రోల్ నెంబర్ 6122కు సంబంధించిన మహిళా కార్మికురాలు తన సొంత పనుల నిమిత్తం గుంటూరుకు వెళ్లి ఉండగా, మంగళవారం రోజు ఆమె ఉపాధి హామీ పనికి హాజరైనట్టుగా ఫోటోలు అప్లోడ్ చేయడం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే జాబ్ కార్డు నెంబర్ 11342, మస్టర్ రోల్ నెంబర్ 6126కు చెందిన దొడ్డిపల్లి సిద్దయ్య అనే వ్యక్తి ఉదయం నుంచే తన సొంత షాపులో పనిచేసుకుంటూ ఉన్నప్పటికీ, అతను కూడా ఉపాధి హామీ పనికి హాజరైనట్టుగా ఫోటోలు అప్లోడ్ చేయబడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా అనేక సందర్భాల్లో ఇదే తరహాలో ఫోటోలు అప్లోడ్ చేస్తున్నారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న మేట్‌పై వెంటనే చర్యలు తీసుకుని, అతనికి ఉన్న లాగిన్‌ను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఈ వ్యవహారం కొనసాగుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే పార్టీలకు అతీతంగా ప్రతి శ్రామికుడికి ఉపాధి హామీ పనులు కల్పించాలని, కేవలం ఇద్దరు లేదా ముగ్గురికే లాగిన్ ఇచ్చి అందరూ వారి వద్దకే వెళ్లి ఫోటోలు దిగే విధంగా వ్యవస్థ ఉండటం సరికాదని ఉపాధి హామీ శ్రామికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరంలోనే 50 మంది శ్రామికులకు ఒక మేట్‌ను ఎంపిక చేసినందున, అర్హులైన వారికి లాగిన్‌లు మంజూరు చేసి ప్రతి ఒక్కరికీ సమానంగా ఉపాధి హామీ పనులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# తాగునీటికి సంబంధించిన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యాన్ని ఎంత మాత్రమూ సహించబోం

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)**
తాగునీటికి సంబంధించిన నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యాన్ని ఎంత మాత్రం సహించబోనని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు స్పష్టం చేశారు. నిబంధనల మేరకు పనిచేయకపోతే కాంట్రాక్టర్లతో పాటు అధికారుల పైనా కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. కొండపి నియోజకవర్గంలో జరుగుతున్న తాగునీటి నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆర్.డబ్ల్యు.ఎస్. పర్యవేక్షణలో జరుగుతున్న పనుల గురించి అధికారులు ఈ సందర్భంగా వివరించారు. కాగా, ఆశించిన స్థాయిలో పురోగతి కచ్చితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పెండింగ్ పనులను తక్షణమే ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని కూడా కలెక్టర్ చెప్పారు. కాంట్రాక్టర్లు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిపిఓ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ మహేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 12)**
ఉలవపాడు మండలం భీమవరం గ్రామ టిడిపి నాయకుడు మల్లవరపు కోటిరెడ్డి, ద్వారక దంపతుల కుమారుడు రాజశేఖర్ రెడ్డి ప్రతిభ పరిశుద్ధ వివాహం మంగళవారం జరిగింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో గ్రామపార్టీ అధ్యక్షుడు జాజుల రవి, పార్టీ నాయకులు గణపతిరాజు చలపతి, వెంకటరామరాజు, తదితరులు హాజరయ్యారు.

## శ్రీగిరిలో భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)**
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం క్షేత్ర పాలకుడు శ్రీ అభయాంజనేయ స్వామి వారికి మంగళవారం హనుమజ్జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు వేద పండితులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార్, ఆత్రేయ, తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## నీట్ పేపర్ లీకేజీని ఖండిస్తూ ఎన్‌టిఏ పేపర్ దహనం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)**
నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఏ ప్రతిరూపాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు దేవా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ కార్యదర్శి సిహెచ్ వినోద్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టిఏ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నీట్ వంటి కీలక జాతీయ స్థాయి పరీక్షల్లో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలు, అవకతవకలు విద్యా వ్యవస్థపై విద్యార్థుల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదువుతున్నా, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాల వల్ల వారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "వన్ నేషన్-వన్ ఎగ్జామ్" పేరుతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కేంద్రీకృత పరీక్షా విధానం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ విధానం కార్పొరేట్ కోచింగ్ సెంటర్లకు లాభాలు చేకూరుస్తూ, గ్రామీణ మరియు పేద విద్యార్థులను తీవ్రంగా నష్టపరుస్తోందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్‌టిఏ వ్యవస్థను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# శ్రీ హరి హర క్షేత్రంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు



వైభవంగా శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి నగరోత్సవం

హనుమ జయంతి సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రం నుండి చీమకుర్తి పుర వీధుల్లో స్వామి వారి నగరోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. చీమకుర్తికి చెందిన హనుమాన్ భక్తులు, ఆర్యవైశ్య మహిళలు స్వామి వారి నగరోత్సవంలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం ఆలాపన చేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా పెద్ద బాబు, శిద్దా వెంకట ప్రసాద్, శిద్దా కాశీ, శిద్దా సాయి బాబు దంపతులు, ఆలయ ఇన్‌ఛార్జి ఎం వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు సుబ్రమణ్య శర్మ, హరి వెంకట కుమారాచార్యులు, హరికృష్ణ శర్మ, కృష్ణ శర్మ, ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.











## ట్రాన్స్ జెండర్ సంక్షేమ బోర్డు సభ్యులుగా బోను దుర్గ నియామకం






## సంతమాగులూరులో ' మీకోసం ' 15న అద్దంకి నియోజకవర్గస్థాయిలో నిర్వహణకు అధికారుల చర్యలు

చర్యలు చేపట్టారు. ఈ నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లాస్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్ళమన్నారు. ఇందులో భాగంగా 15వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంతమాగులూరు ఎంపీడీవో కార్యాలయంలో ' మీకోసం ' కార్యక్రమం జరుగుతుంది.

**సజ్జాపురంలో పల్లెనిద్ర...**
ఈ నెల 15వ తేదీ శుక్రవారం రాత్రి సంతమాగులూరు మండలంలోని సజ్జాపురంలో జిల్లా కలెక్టర్ ' పల్లెనిద్ర ' కార్యక్రమం ఉంటుంది. గ్రామస్తులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి స్థానిక సమస్యలను తెలుసుకుంటారు. రాత్రికి సజ్జాపురంలోనే బస చేసి శనివారం ఉదయం గ్రామంలో పర్యటిస్తారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయికి వస్తున్న దృష్ట్యా ఈ కార్యక్రమాల ద్వారా తమ సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

# పెంచిన ఫీడ్ ధరలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)**
రొయ్యల ఫీడ్ ధరలను అనుమతి లేకుండా పెంచిన కంపెనీలపై తగు చర్యలు తీసుకొని, పెంచిన ఫీడ్ ధరలను వెంటనే తగ్గించడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రకాశం జిల్లా రొయ్యల రైతులు ఒంగోలులోని మత్స్య శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ప్రకాశం జిల్లాలో 13 వేల ఎకరాలలో రైతులు రొయ్యలు పండిస్తున్నారు. ప్రస్తుతం రొయ్యల సాగులో ఉపయోగించే ఫీడ్ ధరలను కొన్ని కంపెనీలు ప్రభుత్వ అనుమతి లేకుండా కేజీ కి టైగర్ ఫీడ్ రూ. 10-70 లు, వెనామీ ఫీడ్ రూ. 8-40లు పెంచాయి. ఇదే విధంగా ఈ పాటికే గత ఫిబ్రవరి నెలలో రూ.4-00 లు పెంచారు. ప్రస్తుతం పెంచిన ధరలతో ఎన్ట్ర. రొయ్యలు పండించడానికి రైతులపై టైగర్ రొయ్యలకు రూ.40-00లు, వెనమీ రొయ్యల రూ.15-00 లు ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయి. ఈ చర్య రైతులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోంది. ఇప్పటికే రొయ్యల మార్కెట్ ధరలు స్థిరంగా లేకపోవడం, కెమికల్ ధరలు, ఫీడ్ ధరలు పెరగడం వంటి కారణాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిలో ఫీడ్ కంపెనీలు తరచుగా ధరలు పెంచడం వల్ల రొయ్యల సాగు చేయడం చాలా కష్టంగా మారింది. ధరల పెంపుపై రైతులు నష్టపోతున్నారు. కావున తమరు వెంటనే జోక్యం చేసుకొని ప్రభుత్వంతో వెంటనే మాట్లాడిఅనుమతి లేకుండా పెంచిన ఫీడ్ ధరలను తగ్గించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, సంబంధిత ఫీడ్ కంపెనీలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి అక్రమ ధరల పెంపులు జరగకుండా చూడాలని మా సమస్యను అత్యవసరంగా పరిగణించి రైతులకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ధర్నాలో అధ్యక్షులు దుగ్గినేని గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి కుంతూరి, సుబ్బారెడ్డి, ఇతర రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)**
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఒంగోలు ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య ఒంగోలులోని శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్‌ని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ లేకుండా సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మాడిఫైడ్ సైలెన్సర్ (పెద్ద శబ్దాలు వచ్చే సైలెన్సర్‌లను) వాడరాదని, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ యాక్ట్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఈ సందర్భంగా తెలియజేయడమైనది. ట్రాఫిక్ రూల్స్, జరిమానాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరెస్పాండంట్, అధ్యాపకులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలి

## కార్యకర్తలకు సూచించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల





(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, మే 12)

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి ప్రచారం చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చినారికట్ల, సిద్ధవరం, నాగరాజుకుంట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినారికట్ల గ్రామంలో ఎప్పుడు తనకు మెజారిటీ ఇవ్వలేదని అయినా కూడా 2015వ సంవత్సరంలో చినారికట్ల, పెదారికట్ల గ్రామాల ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పెదారికట్ల గ్రామంలో రోడ్డు పై రాత్రిపూట గంటల పాటు బైఠాయించానని, అప్పటి కనిగిరి ఎమ్మెల్యే తనతో సంప్రదింపులు జరిపి వైసీపీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తానని మాట ఇచ్చారన్నారు. అదే ఇప్పుడు చినారికట్ల, పెదారికట్ల గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చడానికి రూ.55 కోట్లతో పైపులైన్ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడి పెత్తనం చేస్తున్న నాయకులు ఎప్పుడైనా ప్రజలను పట్టించుకున్నారా అని ప్రజలను ప్రశ్నించారు. కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రచారం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం నాగరాజకుంట గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వారి జయంతి ఉత్సవాలలో భాగంగా గ్రామానికి విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, మాజీ మండల పార్టీ అద్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెలిగొండ స్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, ఇతర నాయకులు, ఆయా గ్రామాల తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఘనంగా పొలిమేర వీరాంజనేయ స్వామి 72వ వార్షికోత్సవం



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మే 12)

ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పొలిమేర వీరాంజనేయ స్వామి వారి 72వ వార్షికోత్సవ తిరునాళ్ల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తీరునాళ్ళ సందర్భంగా విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా స్వామి వారిని వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇంచార్జ్ గాదె మధుసూదన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, బాపట్ల జిల్లా కార్యదర్శి పులకండం రామకృష్ణరెడ్డి, తాటిపర్తి చంద్ర, బిల్లాలి డేవిడ్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## జార్జి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో 13వ ఎన్‌సీసీ ఏటీసీ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో సైబర్ సెక్యూరిటీ పై అవగాహన



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 12)

స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 34 ఆంధ్ర బెటాలియన్ నేతృత్వంలో పది రోజుల యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ -13 లో భాగంగా మంగళవారం ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు సైబర్ సెక్యూరిటీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జార్జ్ ఇంజనీరింగ్ అటానమస్ కళాశాల ప్రాంగణంలో ఈ శిక్షణను 34 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్ వి కమాండెంట్‌గా, లెఫ్టినెంట్ కల్నల్ దినేష్ ఎస్ఎం డిప్యూటీ కమాండెంట్ నేతృత్వంలో మంగళవారం మార్కాపురం రూరల్ ఎస్ఐ వి వేమన విచ్చేసి ఎన్సిసి క్యాడేట్స్ కు సైబర్ నేరాలపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని ఎన్సిసి క్యాడర్స్ కి సూచించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ వేమన ని కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్ వి, డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ దినేష్ ఎస్ ఎం లు ఘనంగా సన్మానించారు. సుబేదార్ మేజర్ సోమేశ్ యం, కళాశాల ఏఎన్‌వో కాప్ అనిల్, పి ఐ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం ఘాట్‌లో అదుపు తప్పిన బస్సులు తప్పిన పెను ప్రమాదం

### లోయలోకి దూసుకెళ్లి బస్సు బోల్తా
### ప్రయాణికులకు గాయాలు
### రెయిలింగ్‌ను ఢీకొట్టి నిలిచిన మరో బస్సు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 12)

మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం నుంచి దోర్నాల వైపు వస్తోంది. ఘాట్‌రోడ్డులో ఎదురొచ్చిన వాహనాలకు సైడిచ్చే క్రమంలో రోడ్డు మార్జిన్ దిగింది. అప్పటికే అక్కడ వర్షపు జల్లులు పడుతుండటంతో పాటు వేగం కారణంగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇనుప రిటైనింగ్ వాల్‌ను దాటి లోయలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న 30 మంది ప్రయాణికులు భయాందోళనతో కేకలు వేశారు. అయితే ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద చెట్లు ఉండడంతో వాటిని ఢీకొట్టి బస్సు నిలిచిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అదే సమయంలో ఆ బస్సు వెనుకవస్తున్న ఇంద్ర బస్సు కూడా వేగం అదుపు కాక రోడ్డు పక్కన ఉన్న రక్షణ ఇనుప కమ్మీలను ఢీకొట్టి నిలిచిపోయింది. అందులో ఉన్న 12 మంది భయాందోళనకు గురయ్యారు.

## మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ క్యాంటీన్‌లో అధిక ధరల దందా పై కలెక్టర్‌కు ఫిర్యాదు






(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 12)

మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లోని రఫీ క్యాంటీన్‌లో ఎంఆర్పీ కంటే అధిక ధరలకు చల్లని పానీయాలు, స్నాక్స్ మరియు ప్యాకేజ్డ్ తాగునీటిని విక్రయిస్తున్నారంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదును హైదరాబాద్‌కు చెందిన హ్యూమన్ రైట్స్ జస్టిస్ కమిషన్‌కు అనుబంధంగా పనిచేస్తున్న క్రిమినల్ అడ్వకేట్ కాటమాల అజిత్ కుమార్ సమర్పించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, క్యాంటీన్



నిర్వాహకులు వినియోగదారుల నుంచి ఎంఆర్పీ ధరలకు మించి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే గతంలో ఈ విషయంపై కేసు నమోదైనప్పటికీ, అక్రమ విక్రయాలు ఆగలేదని తెలిపారు. వినియోగదారులు ప్రశ్నిస్తే అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడుతున్నారని కూడా ఆరోపించారు. ఇటీవల జరిగిన ఘటనలను కూడా ఫిర్యాదులో ప్రస్తావించారు. మార్చి 15 రాత్రి స్ప్రైట్ బాటిల్‌పై నిర్ణయించిన ధర కంటే అదనంగా వసూలు చేశారని, మార్చి 17 మధ్యాహ్నం థమ్స్ అప్ బాటిల్‌పై కూడా అదనపు ధర తీసుకున్నారని పేర్కొన్నారు. కొన్నిసార్లు ఒక్కో వస్తువుపై పది రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై తక్షణ విచారణ చేపట్టి, వినియోగదారులకు న్యాయం చేయడంతో పాటు అధిక ధరల వసూళ్లను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## ఆత్మ రక్షణ, క్రమశిక్షణ, ఏకాగ్రత కోసం కరాటే



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, మే 12)

గిద్దలూరులోని శ్రీ రాజ రాజేశ్వరి బిఈడి కాలేజీలో కరాటే మాస్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్దులు కరాటే విద్యను అభ్యసిస్తున్నారు. కరాటే మాస్టర్ సుబ్రహ్మణ్యం కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థులలో క్రమశిక్షణ, ఆత్మరక్షణ, ఏకాగ్రత మంచి ఆరోగ్యం ఇంకా అనేక లాభాలు వున్నాయని చెప్పారు. బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్నట్టు తెలియజేశారు. ఈ వేసవి సెలవులలో కరాటేతో పాటు కర్రసాము కూడా నేర్పిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఈ వేసవిలో శిక్షణను వుపయోగించుకోగలరని తెలియజేశారు.

## కిషోర బాలల ఆలోచన విధానం అలవర్చుకోవాలి



(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మే 12)

కిషోర వికాసం కార్యక్రమంలో భాగంగా పుల్లల చెరువు సచివాలయం1 పరిధిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ కె.వి. సుబ్బమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిషోర బాలబాలికలకు మానసిక ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ కిషోర వయస్సులో చదువులు, కుటుంబ పరిస్థితులు, స్నేహితులు, బంధువులు, పెద్దల ఒత్తిడి వంటి అనేక కారణాలతో మానసిక ఆందోళనలు ఏర్పడుతాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో సమస్యలను మనసులో దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలని సూచించారు. ఎవరికీ చెప్పకు అనే భయంతో మౌనంగా ఉండటం కంటే సమస్యలకు పరిష్కారం వెతకడం ముఖ్యమని వివరించారు. సరైన ఆలోచన విధానం అలవర్చుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని బాలబాలికలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటయ్య సచివాలయ పీఎస్ శ్రీకాంత్, ఆశా కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా రెవిన్యూ అధికారికి అభినందనలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)
జిల్లా ఎఫ్ఏసి రెవిన్యూ అధికారిగా శ్రీధర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను రెవిన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ తరుపున నాయకులు కలిసి పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ అధ్యక్షులు బి సత్యసాయి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి ఊతకోలు శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాము, జిల్లా ఈసీ మెంబర్ ప్రశాంత నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## హనుమత్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి పూజలు







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 12)
హనుమాన్ జయంతిని పురస్కరించుకుని, కందుకూరు పట్టణంలోని శ్రీ అంకమ్మ తల్లి దేవాలయం సమీపంలో కొలువైన శ్రీరామభక్త దక్షిణముఖ వీరాంజనేయ స్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, హనుమత్ జయంతి ఏర్పాట్ల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, అత్తంటి శ్రీహరినాయుడు, జనసేన పార్టీ నాయకుడు, నిర్వాహకులు కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# కిషోర దశలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి

## సిడిపిఓ సులోచన రాణి







(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 12)
కిషోర దశలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, సరైన మార్గదర్శకత్వం తీసుకుంటే, ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చు అని ఇంకోల్లు సిడిపిఓ సులోచన రాణి అన్నారు. మంగళవారం మండలంలోని సంతరావురు 1 అంగన్వాడీ కేంద్రంలో కిశోరి బాలబాలికలకు యుక్తవయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులు, స్వీయ అవగాహన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిడిపిఓ సులోచన రాణి మాట్లాడుతూ కిశోర బాలికల అవసరాలు, వారు ఎదుర్కొనే సవాళ్లు గురించి వారితో చర్చించి, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరచేలా ప్రోత్సహించలన్నారు. వారితో అలాగే సమస్యలను మాట్లాడుకోవడం ద్వారా పరిష్కార మార్గాలు కనుగొనవచ్చనే కల్పిత కథల ద్వారా వివరించారు. "నాకు అవసరం -- నాకు ఇబ్బంది" అనే అంశం పై కార్డు యాక్టివిటీ నిర్వహించి, బాలబాలికలు తమ భావాలను శక్తి గ్రూపులలో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సులోచన రాణి, డిసిపిఓ పురుషోత్తం, కృష్ణ, సూపర్వైజర్ సునీత, ఉమామహేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, శోభ, హైమ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**చిన్నగంజాం 2 అంగన్వాడీ కేంద్రంలో...**

కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు మనం సహకరించాలని సూపర్వైజర్ సుమలత అన్నారు.మంగళవారం చిన్నగంజాం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం భాగంగా నా అవసరాలు-మన సవాళ్ళ అనే అంశంపై కిశోరి బాలబాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్ సుమలత, కార్యకర్తలు పి విజయలక్ష్మి, జె వెంకటసుబ్బమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

**రాజుబంగారుపాలెం అంగన్వాడీ కేంద్రంలో..**


కిశోరి బాలికలకు సరైన విజ్ఞానం అందించి జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు కిశోరి వికాసం కార్యక్రమం దోహదం చేస్తుందని సూపర్వైజర్ కె వాణిశ్రీ అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం అంగన్వాడీ కేంద్రం నందు కార్యకర్తలు ఎం అనురాధ, సిహెచ్ శ్రీలక్ష్మి, ఎం శిరీష, జివిఎల్ కుమారి, ఎం యానాదమ్మ అధ్వర్యంలో 11 నుండి 18 సంవత్సరాల బాలబాలికలకు యుక్తవయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులు, స్వీయ అవగాహన పై కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె వాణిశ్రీ పాల్గొని నా అవసరాలు మన సవాళ్ళ కార్యక్రమంలో భాగంగా బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది,బాలబాలికలు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

## మన నర్సులు-మన భవిష్యత్తు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)
అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా "మన నర్సులు-మన భవిష్యత్తు-సాధికారత పొందిన నర్సులు ప్రాణాలను కాపాడతారు" అనే ఐక్యరాజ్యసమితి నినాదంతో వైద్య ఆరోగ్యశాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్, కెఎస్ఎమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కనిగిరి పట్టణంలోని కమ్యూనిటీ వైద్యశాల నందు ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి వారు వైద్య రంగంలో అందిస్తున్న సేవలను కొనియాడారు. రోగుల సేవలో నర్సులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తూ ఆరోగ్య వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. కెఎస్ఎమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, మాజీ కనిగిరి మున్సిపల్ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ నర్సుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. కరోనా మహమ్మారిని నివారించడానికి నర్సుల సేవలు వెలకట్టలేనివని, అహర్నిశలు కృషి చేస్తూ కరోనా రోగులకు సేవ చేస్తున్నారని అన్నారు. కమ్యూనిటీ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య మాట్లాడుతూ నర్సులు వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని, రోగులకు ధైర్యం నింపుతూ సేవలందిస్తున్నారని తెలిపారు. గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో నర్సుల సేవలు మరువలేనివని, ప్రజారోగ్య పరిరక్షణలో వారు ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు. వారిని గౌరవించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ వైద్యశాల వివిధ విభాగాల డాక్టర్లు, కెఎస్ఎమ్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధి షేక్ సుహైల్ (బన్ను), వైద్య సిబ్బంది, నర్సులు, ఆశా కార్యకర్తలు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

(షణ్ముఖ వెలుగు, గోపవరం, మే 12)
బద్వేల్ లోని నెల్లూరు రోడ్డులో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి, చౌడమ్మ తల్లి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వల్లెలవారిపల్లె స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉపాసకులు శ్రీశ్రీ పెంచలయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి జలాభిషేకాలు, గణపతి పూజలు, పలు ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారు గంధం, కుంకుమల ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకరణను వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు స్వర్గీయ పెంచలయ్య సతీమణి చంద్రకళ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద సేవలను విజయ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ముమ్మడిరెడ్డి నాగేంద్రరెడ్డి, ఆయన సతీమణి విజయశాంతి నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 12)
మార్కాపురం పట్టణంలో తర్లుపాడు రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి వారి జయంతి సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొని శోభయాత్ర ప్రారంభించారు. అనంతరం ఈ శోభాయాత్ర ఆర్టీసీ బస్టాండ్ కంభం బస్టాండ్ గడియారం స్తంభం సెంటర్ అమ్మవారి శాల మీదుగా దోర్నాల బస్టాండ్ వరకు సాగింది. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు విచ్చేసి జై హనుమాన్ నామస్మరణతో పురవీధులన్నీ పోటెత్తాయి. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్, టిడిపి పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి పివి కృష్ణారావు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.













# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కందుల

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, మే 14)









హనుమత్ జయంతి సందర్భంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మండలంలోని నాగరాజకుంట గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మితమైన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ పూజారుల నుంచి వేద ఆశీర్వచనాలు అందుకుని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా నాయకులతో కలిసి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి చేరుకు తేనీటి విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెలిగొండ స్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కుందురు కాశిరెడ్డి, ముప్ప కాటం రాజు, నాగరాజకుంట మాజీ సర్పంచ్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, భాషాపతిరెడ్డి, గొట్టిపాటి సూరి, తదితరులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కార్మిక పోరాటాల పై మోడీ ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)
నోయిడా, గ్రేటర్ నోయిడా, మానే సర్ , గురుగావ్ ప్రాంతాల్లోని కార్మిక పోరాటాల పట్ల మోడీ ప్రభుత్వ నిర్బంధాన్ని. ఖండించండి. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు అద్దంకి బస్టాండ్ సెంటర్లో నోయిడా కార్మిక వర్గానికి అండగా మోడీ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించి నడిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడుతూ నోయిడా కార్మిక వర్గానికి అండగా నిలబడాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. 8 గంటల పని అమలు చేయాలని 26,000 వేతనం చెల్లించాలని కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అఖిలభక్ష కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుని ఒంగోలు అమలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్మోహన్ , ఎ ఐ టి యు సి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ , ఏఐఎఫ్ టు యు న్యూ జిల్లా నాయకులు ఎం ఎస్ సాయి , ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అయ్యప్ప రెడ్డి , ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెంటనపల్లి శ్రీనివాసులు , రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె వీరారెడ్డి , తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్ మాట్లాడి కార్యక్రమాన్ని ముగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్టీఏ జిల్లా అధ్యక్షుడు జి శేషయ్య, కార్యదర్శి సిహెచ్ రాంబాబు, కోశాధికారి బివి రావు, ఎస్డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి దాసరి మల్లికార్జునరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె శ్రీనివాసరావు, నగర కార్యదర్శి విజయమ్మ, నాయకులు ఎల్ రాజశేఖర్, అంజయ్య, సలార్, తంబి శ్రీనివాసులు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


## ఎంఈఓ కార్యాలయానికి కూలర్ల వితరణ





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 12)
మండలవిద్యాశాఖకార్యాలయంలో వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని, సిబ్బంది, సందర్శకుల సౌకర్యార్థం దాతలు ఉదారత చాటుకున్నారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కార్యాలయానికి ఉచితంగా కూలర్లను అందజేశారు. కీర్తిశేషులు గాయం వెంకట రామిరెడ్డి, సీతామహాలక్ష్మమ్మ స్మృత్యర్థం వారి కుమార్తెలు ఈ విరాళాన్ని ప్రకటించారు. జంకే విజయ లక్ష్మీ సరస్వతి, జడ్పీటిసి సభ్యులు వెన్నా ఇందిర, ఉడుముల పద్మ, ఉడుముల సరస్వతి దాతలు అందజేసిన ఈ కూలర్లను మండల విద్యాశాఖ అధికారులు దేవరకొండ సుజాత, అచ్యుత్ సుబ్బారావులు స్వీకరించారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రభుత్వ కార్యాలయానికి అవసరమైన వస్తువులను సమకూర్చిన దాతల సేవను ఈ సందర్భంగా అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండువగా హనుమాన్ జయంతి వేడుకలు



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 12)
హనుమాన్ జయంతి పర్వదినం పురస్కరించుకుని చిన్నగంజాం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమేత భావనారాయణ స్వామివారి దివ్య దేవాలయం నందు రామభక్త వీర హనుమాన్ జన్మదిన వేడుకను కన్నుల పండుగ లాగా వేద పండితుల మంత్రాచరణ మధ్య ఘణంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రాతఃకాలంలో విశేష అభిషేక పూజలతో పాటు, స్వామివారికి విశేష పంచామృత స్నాపన, తిరువంజన కార్యక్రమన్న అలయ పూజరులు ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హనుమాన్ జయంతిని సందర్భంగా పుష్పాలతో, విద్యుత్ ద్వీపలతో ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం సమయంలో స్వామి వారిని పల్లకి ఉత్సవంలో భాగంగా గ్రామ పురవీధుల్లో కనులపండగగా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)
అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ప్రకాశం జిల్లా పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేశారు. పేకాట ఆడుతున్న స్థావరం పై పోలీసులు దాడులు నిర్వహించి 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక పోలీసు బృందాలు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ భీమ నాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ చెంచయ్య, సిబ్బంది కలసి సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమరాజుపల్లి గ్రామ సమీపంలో కోత ముక్క, పేకాట ఆడుతున్న 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.65,500 నగదు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూద క్రీడలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# కిశోరి వికాసం ద్వారా బాలికలకు సమగ్ర అభివృద్ధి ఎంపీడీవో షేక్ ఖాదర్




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, మే 12)

కనిగిరి డివిజన్ కేంద్రంలోని పాతూరు అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు "కిశోరి వికాసం" పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి ఎంపీడీవో షేక్ ఖాదర్, సీడీపీఓ సరోజిని మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపట్టిన "కిశోరి వికాసం" కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. కిశోరి వికాసం ద్వారా బాలికలకు సమగ్ర అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికలు తమ హక్కుల పై అవగాహన పొందడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్య మార్పులను అర్థం చేసుకుని సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని పెంపొందించుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా బాలికలకు ఆరోగ్యం, పోషణ, భద్రతా చట్టాలు, జీవిత నైపుణ్యాలు, సామాజిక అంశాలపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. అలాగే అత్యవసర సహాయం కోసం 112, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ గోపి, ఎన్ఐఆర్‌డీ సర్టిఫైడ్ మాస్టర్ రిసోర్స్ పర్సన్ గుడ్ హెల్ప్ రమేష్ బాబు వక్తలుగా పాల్గొన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్లు పార్వతి, సుమతి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొని బాలికలకు పలు సూచనలు అందించారు. కార్యక్రమానికి అంగన్వాడీ టీచర్లు, స్థానిక కిశోరి బాలికలు, అలాగే వేసవి సెలవుల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి బంధువుల ఇళ్లకు వచ్చిన కిశోరి బాలికలు హాజరయ్యారు.

# ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన మండవ మురళీకృష్ణ








(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 12)

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని ప్రకాశం జిల్లా కమ్మవారి సేవాసంఘం అధ్యక్షులు, సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ మంగళవారం కందుకూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్మవారి సేవా సంఘం సభ్యులు అలా హనుమంతరావు, రాఘవరావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, మోటుపల్లి వెంకటేశ్వర్లు, ఏపీఈడబ్ల్యుఐడీ కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరు రాంబాబు, తదితరులు ఉన్నారు.

# మాభూమి సిట్ లో ఉంటే ఎలా బ్రోకరేజ్ చేసి అమ్మించావు

మావి ఫేక్ పట్టాలంటే ఇతరులకు బ్రోకరేజ్ చేసి ఎలా అమ్మించావు
మాభూమి కొనుగోలు చేసిన మహిళ పై దాడి చేయడం సరైన పద్ధతి కాదు
మీ పత్రాలు కరెక్ట్‌గా ఉంటే అర్ధరాత్రి గోడలు కూల్చడం ఎందుకు?
అధికారుల సమక్షంలో తేల్చుకుందాం
ఈపాటికే సర్వేయర్లు కూడా భూమితో మీకు సంబంధం లేదని తేల్చలేదా
తానికొండ మురళి పై శ్రీపతి పేరయ్య ఆగ్రహం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)

పదేపదే మా భూములు జోలికి వచ్చి ఇబ్బందులు పెట్టొద్దని శ్రీపతి పేరయ్య తానికొండ మురళీకృష్ణ, ఎల్ఐసి శ్రీనులను హెచ్చరించారు. ఒంగోలు నగర పరిధిలోని పెళ్లూరు సర్వేనెంబర్ 112/1లో భూ వివాదం ముదిరింది. ఈ నేపథ్యంలో శారద అనే మహిళకు భూమిని అమ్మిన శ్రీపతి పేరయ్య మాట్లాడుతూ సర్వేనెంబర్ 112/1 సిట్ పరిధిలో ఉంటే ఇతరులకు ఆ భూమిని ఎలా బ్రోకరేజ్ చేసి అమ్మిపించావని మురళీకృష్ణ పై ఫైర్ అయ్యారు. పెదిరెడ్డికి, ఆయన భార్య రేఖకు, అమర్నాథ్ రెడ్డికి ఆ భూములు బ్రోకరేజ్ చేసి అమ్మిపించింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారమే ఆ భూముల అమ్మకాలు జరిగాయని పేరయ్య పేర్కొన్నారు. ఇతరులను మోసం చేయడంలో మురళీకృష్ణ దిట్ట అన్నారు. గతంలో ఆర్టీవో ఆఫీస్ వద్ద జిరాక్స్ షాపును నడిపిన మురళీకృష్ణ పై అనేక అవినీతి కేసులో లేవా అని ప్రశ్నించారు. గోపాల్ నగరంలో అప్పులు చేస్తే మహిళలు కొట్టిన చరిత్ర నీది అన్నారు. మేము శారదా అనే మహిళకు భూములు అమ్మితే నీవు నీ బామ్మర్ది ఆమెపై దాడి చేయలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నివి పక్కా భూములు అయితే అర్ధరాత్రి గోడలు కూల్చడం ఎందుకు, అధికారుల మధ్య తేల్చుకుందామని అన్నారు. ఈపాటికే మూడు పర్యాయాలు కలెక్టర్ గ్రీవెన్స్ కి వెళ్లిన నీకు చుక్కెదురు కాలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మా భూములు జోలికి రాకుండా ఉంటే పద్ధతిగా ఉంటుందని హెచ్చరించారు.



# పెద్దిరెడ్డి అరాచకాలకు సపోర్ట్ చేస్తున్న ఎమ్మెల్యే మహిళలు, అధికారులు, పల్లె కారులపై దాడులు చేసిన పెద్దిరెడ్డి పై కేసులు ఉండవా

భూ కబ్జా నేత, అరాచక వాది పెద్దిరెడ్డిని
తెలుగుదేశం పార్టీ నుండి సస్పెండ్ చేయాలి
దళిత నేత నీలం డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 12)

భూ కబ్జాలు చేస్తూ మహిళలు, అధికారులు, పల్లె కారులపై దాడులకు పాల్పడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డిని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సపోర్ట్ చేస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ధ్వజమెత్తారు. మంగళవారం ఒంగోలు అంబేద్కర్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ పెద్దిరెడ్డి గతంలో వైయస్సార్ పార్టీ నాయకుడిగా ఉంటూ భూ కబ్జాలకు పాల్పడి పోలీసు కేసుల నుండి తప్పించుకోవడానికి మరల అధికార తెలుగుదేశం పార్టీలో చేరాడని అన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ లతో సన్నిహితంగా ఉంటున్నట్టు ఫోటోలు చూపిస్తూ సంతనూతలపాడు లో తన బంధువులు సంగ్రామరెడ్డి తో కలిసి మాదిగ మాన్యం పోలీసు రెవెన్యూ సహకారంతో ఆక్రమించి ఫినిషింగ్ ఏసాడన్నారు. దీనిపై భూ హక్కు దారుడు బొమ్మల దేవ సహాయం ఫిర్యాదు చేసిన ఒంగోలు డిఎస్పీ కనుసన్నల్లో సంతనూతలపాడు ఎస్సై కేసు నమోదు చేయలేదన్నారు. చెయ్యకపోగా తిరిగి మాదిగలపైనే క్రైమ్ నెంబర్ 79 /25 కేసు కట్టారన్నారు. పెర్నమిట్ట సర్వేనెంబర్ 148 లోని ఒక ఎకరా నాలుగు సెంట్లు తమ పూర్వికులు హక్కు గల భూమికి మా భూమి పై ఎటువంటి హక్కు లేని మంచికలపాటి అనిత,కామేశ్వరి నెల్లూరికి చెందిన మహిళల వద్ద జనరల్ పవర్ అటార్నీ రౌడీ మోకలచే అప్పటి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తాలూకా సిఐ శ్రీనివాస్‌రెడ్డిల సహకారంతో భూమిని కబ్జా చేసి ఫినిషింగ్ వేశాడు అన్నారు. సర్వే నెం.148 పేరుతో మరల సర్వే నెంబర్ 138 తదితర ఆరేడు సర్వే నెంబర్లకు మహిళలను మోసం చేసి బలవంతంగా జిపిఏ రాయించుకున్నాడన్నారు. మోసం తెలుసుకొని పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి విషయంలో చేసిన మోసం తెలుసుకొని అన్యాయం అని అడగటానికి ఒంగోలు వచ్చిన అనిత, కామేశ్వరిలను మంగమూరు రోడ్డులో సూర్య ప్రకాశ్‌రెడ్డి దాడి చేశారన్నారు. ఈ ఘటన పై గత డిసెంబర్ 5వ తేదీన జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా డిసెంబర్ 8వ తేదీన ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఒంగోలు ఎమ్మెల్యే ఆదేశాలతో కేసు నమోదు చేయకుండా కేవలం స్టేట్మెంట్ రికార్డ్ చేసుకొని మహిళలను పంపించేశారన్నారు. అంతట సదరు మహిళలు సూర్యప్రకాశ్‌రెడ్డి తమను బెదిరించి మోసం చేసి చేయించుకొన్న జీపీఏలను పత్రికా ముఖంగా ప్రకటన చేసి ఒంగోలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రద్దు చేసుకున్నారన్నారు. తెలుగుదేశం పచ్చ పోలీసు బలం, అండతో రెచ్చిపోయి తెలుగుదేశం భూ కబ్జా నాయకుడు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి ఒంగోలు రిజిస్టర్ కార్యాలయంలోకి వెళ్లి రిజిస్టర్ అధికారులపై దౌర్జన్యకాండ జరిపి తెలుగు రెడ్డి హంగామా చేసాడన్నారు. జిల్లా రిజిస్టార్ ఉండే కార్యాలయంలో తెలుగుదేశం పార్టీని ప్రకాశం జిల్లాలో అధికారంలోకి తెచ్చిన సూర్య ప్రకాష్ రెడ్డి రౌడీయిజం పై స్థానిక తాలూకా ఎస్సై ఫణిభూషణ్ స్పెషల్ బ్రాంచ్ ఇంటెలిజెన్స్ పోలీస్ అధికారులు వచ్చి వెళ్లేరే తప్ప ఒంగోలు ఎమ్మెల్యే ఆదేశాలతో ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్లో కేసు కట్టలేదన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ గెలుపులో కీలక పాత్ర పోషించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జనాకర్షక నేత పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి పై కేసులు లేకుండా ఒంగోలు ఎమ్మెల్యే కాపాడుతున్నారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యేకి అవసరం ఉందని గ్రహించిన పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి రెచ్చిపోయి ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే నియోజకవర్గంలో మడనూరు సముద్ర తీరంలో పీకలదాకా మద్యం తాగి పల్లె కారుల పై దాడి చేయగా పల్లెకారులు ఏకమై పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి రౌడీ గ్యాంగుని రామాలయం దగ్గర కట్టేసి మహిళలతో సహా దేహశుద్ధి చేసి కాళ్లు పట్టించుకున్నారన్నారు. కొత్తపట్నం ఎస్ఐ పోలీస్ బలగాలతో వెళ్లి ప్రత్యక్షంగా సంఘటనను చూసి కూడా తెలుగుదేశం భూ కబ్జా నేత సూర్య ప్రకాష్ రెడ్డి గ్యాంగ్ పై కేసు నమోదు చేయలేదన్నారు. కేవలం 25 వేల రూపాయలు జరిమానాతో తెలుగుదేశం పార్టీ అధికార నేత సూర్య ప్రకాష్ రెడ్డి ఒంగోలు ఎమ్మెల్యే ఆదేశాలతో బయటపడ్డారన్నారు. అధికార పార్టీ అండతో ఒంగోలు ఎమ్మెల్యే గొడుగునీడలో భూకబ్జాలు చేస్తూ మహిళలు ప్రభుత్వ అధికారులు పల్లె కారులపై దాడులు చేస్తున్న పోలీసు కేసులు ఎందుకు ఒంగోలు డి.ఎస్.పి కేసులు కట్టటం లేదన్నారు. భూకబ్జాలు దాడులు ఫ్యాక్షన్ సంస్కృతిని సహించపోమంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూ కబ్జా అరాచక అక్రమాల పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి ని తెలుగుదేశం పార్టీ నుండి సస్పెండ్ చేయాలని నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, యానాది పరిరక్షణ సమితి కన్వీనర్ కోలా జీవరత్నం, జై భీమ్ కన్వీనర్ రంజిత్ కుమార్, దేవరపల్లి గోపి, తదితరులు ఉన్నారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com